క్లుప్తంగా

అడ్మిషన్లు ప్రారంభం

జోగిపేట(అందోల్): స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అభ్యాసక సహాయక కేంద్రం స్టడీ సెంటర్లో మొదటి యేడాదికిగాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేశ్, సమన్వయకర్త ఎ.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 18లోగా అడ్మిషన్‌లు పొందాలని పేర్కొన్నారు. కళాశాలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 73829 29780, 9494875790నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గోతుల పూడ్చివేత



పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్: పట్టణంలోని 161బీ జాతీయ రహదారిపై ఏర్పడిన గోతులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూడ్చివేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల గోతులు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సోమవారం బసవేశ్వర చౌక్ నుంచి శివాజీ చౌక్ వరకు ఉన్న గోతులను పూడ్చారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ తదితరులు ఆ పనులను పర్యవేక్షించారు.

రక్షణ సామగ్రి అందజేత

వర్షాకాలంలో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులకు గురికాకుండా విధులు నిర్వర్తించేందుకు రెయిన్‌కోట్, సెఫ్టీజాకెట్లు, గ్లౌజులు, బూట్లు తదితర సామగ్రిని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు వర్షాల్లో సైతం మురుగుకాల్వలు శుభ్రం చేయడం, పరిశుభ్రత పనులు చేస్తున్నందున వారి రక్షణ కోసం వాటిని అందజేశామన్నారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారి విస్తరణ షురూ



జేసీబీ సాయంతో చేపట్టిన తవ్వకాలు

నారాయణఖేడ్: నిజాంపేట- ఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణ పనులు ఖేడ్ డివిజన్ పరిధిలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఖేడ్ నుంచి మనూరు వెళ్లే మార్గంలో మార్కింగ్ మేరకు జేసీబీతో తవ్వకం పనులను చేపట్టారు. బాణాపూర్, జగన్నాథూర్ శివార్లలో తవ్వకాలు పూర్తికాగా పిప్రి శివారులో తవ్వకాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే నర్సాపూర్ సమీపంలో రోడ్డుపక్కల ఉన్న చెట్లను తొలగించారు. అలాగే జహీరాబాద్ డివిజన్ పరిధిలోనూ పనులు కొనసాగుతున్నాయి.

రోడ్డుకు మరమ్మతులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం నుంచి మెడికల్ డివైజెస్ పార్కు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో సోమవారం కాంగ్రెస్ నేత, మాజీ వార్డు సభ్యుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను జేసీబీతో చదును చేయించారు. మాదారం నుంచి నిత్యం వందల సంఖ్యలో డివైజెస్ పార్కులోని పలు పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు కార్మికులు, ప్రజలు వెళ్తుంటారని రాజుగౌడ్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తమవంతు సాయంగా తాత్కాలికంగా రోడ్డుపై ఉన్న గుంతలను చదును చేయించామన్నారు.

చర్యలు తీసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): బోనాల పండుగ సందర్భంగా బొల్లారం మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ యువజన నాయకుడు ఇమ్రాన్ డిమాండ్ చేశారు. సోమవారం పలువురు నేతలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీని కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మురుగునీటితో అవస్థలు

సంగారెడ్డి: సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆ ప్రాంతంలో పరిశీలించారు. వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోవడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి నీరు నిలిచి పోకుండా చూడాలని కోరారు.



పరిశీలిస్తున్న శ్రీధర్

బస్టాండ్‌లో వసతులు కరువు

రోడ్డుపైనే నిలుపుతున్న బస్సులు
- బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

సంగారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ఉన్న రెండు ఆర్టీసీ బస్టాండ్‌లలోను కనీస వసతులు కరువయ్యాయి. ప్రయాణికుల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం మెరుగు పడడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అంతర్ సర్వీసులతోపాటు హైదరాబాద్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఇక్కడ నుండే వెళ్తుంటాయి. లింగంపల్లి చౌరస్తా నుంచి జహీరాబాద్ వరకు పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బుదేరా, కంకోల్, సదాశివపేట, కోహీర్ ప్రధానంగా దూరప్రాంతాల సర్వీస్‌లతో పాటు అంతర్ రాష్ట్ర సర్వీసులను బస్టాండ్‌లో నిలుపుతారు. పాత బస్టాండ్‌తో పాటు, న్యూ బస్టాండ్‌లోను మూత్రశాలలు లేకపోవడంతో చాలామంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు బస్టాండ్ వద్ద అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. మరుగు దొడ్ల దుర్వాసన వెదజల్లుతున్నాయి. బస్టాండ్‌లలో కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

రోడ్డుపైనే వేచిఉండాల్సిన దుస్థితి

బస్టాండ్‌లో సరైన వసతులులేక ప్రయాణికులు పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో రోడ్డుపైనే వేచిఉండాల్సి వస్తోంది. వర్షాకాలంలో అయితే ఆ కష్టాలు వర్ణనాతీతం. వర్షంలో తడుస్తూనే బస్సుల కోసం ఎదురు చూడవలసిన పరిస్థితి. చౌరస్తాలో మూత్రశాలలు, తాగునీటి సౌకర్యంలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు విన్నవిస్తా..



సంగారెడ్డి చౌరస్తాలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం. రోడ్డు పనులు నడవడంతో బస్సుస్టాప్‌కు ఇబ్బందిగా ఉంది. రోడ్డు పనులు పూర్తయాక నిర్మాణానికి స్థలం కేటాయిస్తే అన్ని వసతులు కల్పిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– ఉపేందర్, సంగారెడ్డి డిపో మేనేజర్

బస్టాప్ ఏర్పాటు చేయాలి

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి చౌరస్తాలోని పోతిరెడ్డిపల్లిలో బస్టాప్ ఏర్పాటు చేయాలి. హైదరాబాదు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సరైన వసతులులేవు. షెల్టర్లు లేక ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి.

– శ్రీధర్ మహేంద్ర, సంగారెడ్డి

ఇబ్బందులు పడుతున్నాం..

నిత్యం ఉద్యోగాలు, చదువుల కోసం హైదరాబాదుకు వెళుతుంటాం. వందలాది మంది బస్సుల కోసం వేచి ఉంటున్నా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ఏవిధమైన ఏర్పాట్లు లేవు. తాగునీరు, మూత్రశాలలు లేక చాలా కష్టాలు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి. – సంతోష్, ప్రయాణికుడు

మొక్కలతో ఎన్నో ప్రయోజనాలు

మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

జోగిపేట(అందోల్): ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ముఖ్యమని సూచించారు. అనంతరం కౌన్సిలర్ చిట్టిబాబు మాట్లాడుతూ పండ్లు, పువ్వుల మొక్కలను పంపిణీ చేశామన్నారు. వనమహోత్సవంలో 17వ వార్డు ఆదర్శంగా నిలవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ వార్డులో మహిళలు మొక్కలు తీసుకువెళ్లేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినయ్‌కుమార్, అలీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



జోగిపేట(అందోల్): మొక్కలు పంపిణీ చేసిన చైర్మన్, కౌన్సిలర్‌లు

2700 మొక్కలు నాటాలి

మునిపల్లి(అందోల్): వనమహోత్సవంలో భాగంగా మండలంలోని బుదేరా గ్రామ శివారులో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉల్లాస్ ఆధ్వర్యంలో కార్మికులు మొక్కలు నాటారు. బీడు భూములు, ఖాళీ స్థలాలు, రెవెన్యూ, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లలో సుమారు 2700 వివిధ రకాల మొక్కలు నాటాలని సంబంధిత అధికారులు టార్గెట్ ఇచ్చారని ఆయన చెప్పారు. అందులో భాంగానే కూలీలతో మొక్కలు నాటిస్తున్నట్టు తెలిపారు.

హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మహేశ్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని బీసీ గరల్స్ హాస్టల్ శిథిలావస్థకు చేరిందని, వెంటనే నూతన భవనం నిర్మించాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు హాస్టల్‌ను సందర్శించారు. పరిసరాలు, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్లో బాలికలకు నాణ్యమైన భోజనం పెట్టడంలేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సౌకర్యం లేదని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని వాపోయారు. వర్షం కురిసినప్పుడు గదులలోకి నీరు చేరుతోందని, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్తీక్, స్వప్న, శిరీష, సంధ్య, సింధు తదితరులు పాల్గొన్నారు.



బాలికలతో మాట్లాడుతున్న మహేశ్

సమస్యల పరిష్కారానికే ‘బస్తీబాట’

జహీరాబాద్ టౌన్: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు సీపీఎం నాయకులు సోమవారం బస్తీ బాట కార్యక్రమం ప్రారంభించారు. జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ పరిధిలోని రహ్మత్‌నగర్, డబుల్ బెడ్‌రూం కాలనీలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీలు లేక మురుగునీరు నిలిచిపోతుందని, రోడ్లు దెబ్బతిన్నాయని స్థానికులు వారికి తెలియజేశారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరతామన్నారు. సలీమొద్దీన్, నరేశ్, ముత్తబీర్, రాజు, ఫహీమ్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

విద్యకు నిధులు పెంచండి

టీపీటీఎఫ్ రాష్ట్ర నేత అశోక్

సంగారెడ్డి టౌన్: విద్యకు బడ్జెట్‌లో నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు 20శాతం నిధులు కేటాయించారని విమర్శించారు. బడ్జెట్‌ను పెంచి విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామచందర్, సంజీవయ్య, శ్రీధర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సహజం



మాట్లాడుతున్న సర్పంచ్ సుగుణమ్మ

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగ విధుల్లో బదిలీలు సహజమని మొగుడపల్లి మాజీ సర్పంచ్ సుగుణమ్మ అన్నారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పదేళ్లపాటు కార్యదర్శి గ్రామానికి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నేత విజయ్ మోహన్‌రెడ్డి, కేవీపీఎస్ మండల కన్వీనర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేత

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని తంగడపల్లి ప్రధాన రహదారి బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, భవనాలశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏసోబు, ఆంజనేయులు, సంతు రెడ్డి, రాములు, బసవయ్య, ప్రభాకర్ రెడ్డి, భరత్, లక్ష్మయ్య, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ యూటీఎఫ్‌లో పలువురు చేరిక



జహీరాబాద్: విద్యారంగాన్ని బలోపేతం కోసం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కరం కోసం చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై టీపీటీఎఫ్ నాయకులు యూటీఎఫ్‌లో చేరినట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు టీపీటీఎఫ్ నాయకులు తమ యూనియన్‌లో చేరారని చెప్పారు. ఈ సందర్భంగా సభ్యత్వాన్ని అందజేశారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు బి.సాయిలు, కాశీనాథ్, సువర్ణ, శామయ్య, జగన్మోహన్, సమియొద్దీన్, సిరాజొద్దీన్, ముకుంద, విఠల్, ప్రశాంత్ కుమార్, విజయ్‌కుమార్, యాదయ్య, పవన్ పాల్గొన్నారు.

◆ నేడు రంజోల్‌కు కలెక్టర్ రాక

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్ రైతు వేదికలో మంగళవారం ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించనున్న అవగాహన సదస్సుకు కలెక్టర్ క్రాంతి హాజరవుతున్నట్లు హార్టికల్చర్ అధికారి శైలజ తెలిపారు. ఉదయం 10గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, రైతులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కలెక్టర్ రంజోల్ సమీపంలోని బాబానగర్‌లో మొక్కలు నాటుతారని చెప్పారు.

◆ ఇద్దరిపై కేసు నమోదు

జోగిపేట(అందోల్): పట్టణంలో జరిగిన ఓ దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాండు తెలిపారు. బస్టాండ్ సమీపంలో అరటి పండ్లు విక్రయించే వహీద్ అతడి స్నేహితుడు సల్మాన్ న్యూసెన్స్ చేస్తున్నారంటూ వారిపై ఆదివారం రాత్రి మెడికల్‌కు చెందిన ప్రదీప్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ దాడికి దిగారు. దీంతో సోమవారం ఉదయం సల్మాన్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి లక్ష రూపాయలు సోమవారం విరాళంగా అందజేశారు. దీంతో నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ చైర్మన్ పదవి రేసులో సాయిలు



కల్హేర్(నారాయణఖేడ్): నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు కావడంతో రేసులో తాను ఉన్నట్లు మండలంలోని బీబీపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారి సాయిలు తెలిపారు. సోమవారం కల్హేర్‌లో మాట్లాడుతూ ఎన్నో యేళ్లుగా పార్టీని నమ్ముకున్నానని, పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేశానని చెప్పారు. పార్టీ తనను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అప్పగించాలని ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డిని కోరారు.



జోగిపేట(అందోల్): పూజలు చేస్తున్న బృందావన్ కాలనీ వాసులు

ఘనంగా బోనాల ఉత్సవాలు



న్యాల్‌కల్(జహీరాబాద్): ముంగిలో...



ప్రీతమ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



పటాన్‌చెరు టౌన్‌లో..

జోగిపేట(అందోల్): ఆషాఢం సందర్భంగా బృందావన్ కాలనీలో సోమవారం ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. కోఆప్షన్ సభ్యుడు, కాలనీ అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్, ఎస్ఐ పాండు, కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ముంగిలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామంలో బీరప్పస్వామికి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. డప్పు చప్పుళ్ల మధ్య పోతురాజులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి నిదర్శనం

పటాన్‌చెరు టౌన్: బోనాలు తెలంగాణ సంస్కృతికి నిదర్శనం అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. మండలంలోని ముత్తంగి గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బోనాల తొట్టెల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఏడుగుళ్ల పోచమ్మ దేవాలయం, ముదిరాజ్ బస్తీ, జీపీ కాలనీలలోని పోచమ్మ దేవాలయాలు, అదేవిధంగా గోనెమ్మ బస్తీలోని అమ్మవారి దేవస్థానంలో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు అమ్మవారి ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపును ఉత్సాహంగా నిర్వహించారు. గోకుల్ బస్తీ యాదవులు నిర్వహించిన ఊరేగింపులో కార్పొరేటర్ మెట్టు కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సపానదేవ్, ఎమ్మెల్యే కుమారుడు గూడెం విక్రమ్ పాల్గొన్నారు.

ఘనంగా గొల్ల కురుమల పండుగ



ఊరేగింపులో పాల్గొన్న గొల్ల కురుమలు

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామంలో సోమవారం గొల్ల కురుమలు పసక పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఉరేగింపుగా తీసుకువెళ్లి మహాత్మ భోగొండేశ్వర, బీరప్ప, మల్లన్న ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్టు చెప్పారు. కురుమ సంఘం అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ అంబన్న, పరన్న, శ్రీశైలం, పాండు కురుమ సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో వారంలో రెండు రోజులు రవాణాశాఖకు సంబంధించిన సేవలు అందించేందుకు కార్యాలయం ఏర్పాటుకు జహీరాబాద్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి సోమవారం స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న రైతుబజారులోని కార్యాలయ భవనాన్ని కార్యాలయంగాను, ఆవరణలో చుట్టూఉన్న ఖాళీప్రదేశాన్ని వాహనాల డ్రైవింగ్స్ కోసం వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు భవనంతోపాటు ఖాళీ ప్రదేశాన్ని శుభ్రం చేయించాలని శానిటరీ అధికారి శ్రీనివాస్‌కు సూచించారు. అవసరమైన ఏర్పాట్లు చేయిస్తామని చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎంవీఐకి తెలిపారు.

అధ్వానంగా కల్వకుంట రోడ్డు



ధ్వంసమైన కల్వకుంట రోడ్డు

సంగారెడ్డి: సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి కల్వకుంట గ్రామం వరకు వెళ్లే రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు సిమెంట్ రోడ్డు మొత్తం కంకర తేలడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో జారిపడి గాయాల పాలవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డును నిర్మించి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై నిర్లక్ష్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో పాలకులు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో లక్షలాది రూపాయలతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. కాని సంబంధిత అధికారులు వాటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో కొన్ని పరికరాలు పూర్తిగా చెడిపోతున్నాయి. కొన్ని విరిగి ధ్వంసమయ్యాయి. తెల్లాపూర్‌లోని జిమ్ పరికరాలు ధ్వంసమవడంతో అక్కడి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పాడైన వాటికి మర్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావస్తే తమకు ఎంతో ఉపయోగపడతాయని చెబుతున్నారు.



తెల్లాపూర్ ఓపెన్ జిమ్‌లో పక్కన పడిఉన్న పరికరం